

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- తల్లి, చిన్న కుమార్తె మృతి
- పెద్ద కుమార్తె పరిస్థితి విషమం
- దంపతుల మధ్య మనస్పర్థలే కారణం?

... మెయిన్‌లో



భర్త, పిల్లలతో మహంతి మాధవి (ఫైల్ ఫొటో)



రైల్వే స్టేషన్‌కు విద్యుద్దీపాలతో అలంకరణ

పోలీస్ బ్యారెక్స్‌లో నేడు గణతంత్ర వేడుకలు

ఏర్పాట్లు పరిశీలించిన జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

- 450 మందికి ప్రశంసాపత్రాలు
- సిద్ధమైన వివిధ శాఖల శకటాలు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నగరంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర వేడుకలు జరగనున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. రిపబ్లిక్ డేకు జీవీఎంసీ, పాఠశాల విద్య, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్య, స్త్రీ శిశు సంక్షేమ, ఈపీడీసీఎల్, వ్యవసాయ, గృహ నిర్మాణ సంస్థ, డీఆర్‌డీఏ శకటాలు సిద్ధమయ్యాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, రుణాల పంపిణీ ఉంటాయి. ఇంకా అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కాగా వేడుకల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శనివారం పరిశీలించారు.



త్రివర్ణ పతాకాలతో పోలీస్ పరేడ్ గ్రౌండ్

450 మందికి ప్రశంసాపత్రాలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో విశేష సేవలు అందించిన 450 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేస్తారు.

ద్వారకా బస్ స్టేషన్‌లో సమస్యలు కోకొల్లలు

ఆర్టీసీ కాంప్లెక్స్

ఆంధ్రజ్యోతి విజిట్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దుర్గంధం వెలువడే మరుగుదొడ్లు...నాచుపట్టిన కొళాయిలు...పనిచేయని సీసీ కెమెరాలు... తిరగని ఫ్యాన్లు...అడపాదడపా ప్రయాణికులపై కుక్కల దాడులు... ఇదీ స్థూలంగా ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద బస్ స్టేషన్‌గా గుర్తింపుపొందిన నగరంలోని ద్వారకా కాంప్లెక్స్‌లోని పరిస్థితి. సమస్యల పరిష్కారంపై ఆర్టీసీ అధికారులు సరిగా దృష్టి పెట్టకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది.

ద్వారకా బస్ స్టేషన్‌ను సుమారు 6.77 ఎకరాల్లో 1979 సెప్టెంబరు 27న ప్రారంభించారు. ప్రయాణికుల కోసం 35 ప్లాట్‌ఫారాలు నిర్మించారు. ఇక్కడ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఒడిశా, చత్తీస్‌గఢ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు నిత్యం 381 బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటికితోడు నగరంలో వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసేందుకు 604 సిటీ బస్సులు ద్వారకా బస్‌స్టేషన్‌కు వచ్చిపోతుంటాయి. ద్వారకా బస్ స్టేషన్ నుంచి రోజూ సగటున 50 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతటి ముఖ్యమైన బస్ స్టేషన్ నిర్వహణ ఆశించిన స్థాయిలో లేదు. ప్రయాణికులకు తగిన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.



అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

- పనిచేయని సీసీ కెమెరాలు, ఫ్యాన్‌లు
- మరుగుదొడ్ల నుంచి దుర్వాసన
- నాచుపట్టిన తాగునీటి కొళాయిలు
- శిథిలమైన మ్యాన్ హోల్స్ పైకప్పులు
- కుక్కల బెడద
- దుకాణాల్లో నాణ్యత లేని కంపెనీల ఉత్పత్తులు విక్రయం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు





కాంప్లెక్స్ ఆవరణలో శునకం

పనిచేయని సీసీ కెమెరాలు

బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత, చోరీల నియంత్రణ కోసం ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో 50, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మరో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. వీటి నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఒకటి, రెండు మినహా మిగిలినవి మూలకు చేరిపోయాయి. దీంతో బస్ స్టేషన్‌లో ప్రయాణికుల బ్యాగులు, సెల్‌ఫోన్‌లు చోరీలు పెరిగిపోయాయి. ఇందుకు సంబంధించి రోజుకు కనీసం ఒక్క ఫిర్యాదైనా పోలీసులకు అందుతోంది. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి కాంప్లెక్స్‌ను సందర్శించినప్పుడు స్థానిక పోలీస్ అధికారులు సీసీ కెమెరాలు పనిచేయలేదని ఫిర్యాదు చేశారు. అయినా ఇంతవరకూ చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు.

ఆవరణలో వీధి కుక్కల హల్‌చల్

బస్‌స్టేషన్‌లో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ప్రయాణికులు బెంచీలపై కూర్చొంటే కుక్కలు వారి లగేజీ మధ్యలో నిద్రపోతున్నాయి. ప్రయాణికులు బస్సుల కోసం హడావిడిగా వెళుతుంటే కుక్కలు వారికి అడ్డంగా తిరుగుతున్నాయి. పొరపాటున కాలు తగిలితే అవి ప్రయాణికులపై దాడి చేస్తున్నాయి.



తాగునీటి కొళాయిలకు నాచుపట్టిన దృశ్యం

మరుగుదొడ్ల నుంచి తీవ్ర దుర్వాసన

కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటుచేసిన మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. మరుగుదొడ్డి వినియోగించేవారి నుంచి రూ.5, రూ.పది చొప్పున వసూలుచేస్తున్న సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్న బాధ్యతను విస్మరిస్తున్నారు. దీంతో మరుగుదొడ్ల నుంచి దుర్వాసన వెలువడి కాంప్లెక్స్ ఆవరణలో బస్సుల కోసం నిరీక్షిస్తున్నవారి ముక్కుపుటాలదిరిపోతున్నాయి. దీనిపై అక్కడి సిబ్బందికి కొంతమంది ఫిర్యాదు చేసినా కనీసం స్పందించకపోవడం చూస్తే అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.



ప్లాట్‌ఫామ్ మధ్యలో రంధ్రం

ఆవరణలో పారిశుధ్యలోపం

కాంప్లెక్స్ ఆవరణతోపాటు పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. కాంప్లెక్స్‌కు ఆనుకుని ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో కొన్ని పార్లర్లు ఉన్నాయి. వాటి నుంచి వాడుక నీరు బయటకు వదిలేస్తుండడంతో రోడ్డుపై నిలిచిపోతోంది. ఆహార వ్యర్థాలతో కూడిన నీరు కావడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే బస్‌లు ఆగే ప్లాట్‌ఫారాల వద్ద ఉన్న మ్యాన్‌హోల్స్‌పైన ఉన్న పైకప్పులు విరిగిపోయాయి. ప్రయాణికులు అప్రమత్తంగా

... మిగతా 8వ పేజీలో

నేడు నగరానికి మంత్రి నారా లోకేశ్

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

ఒక కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరయ్యేందుకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆదివారం నగరానికి వస్తున్నారు. సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి రాత్రి 7.40 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న పార్టీ కార్యాలయానికి వెళ్లి బస చేస్తారు. 27వ తేదీ ఉదయం కోర్టుకు హాజరవుతారు. సాయంత్రం 4.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.





విజయవాడలో శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్

కలెక్టర్‌కు అవార్డు

- ఎన్నికల నిర్వహణలో ప్రతిభ కనబరచినందుకు ప్రదానం

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

సాధారణ ఎన్నికల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అవార్డు ప్రదానం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డు అందజేశారు. విశాఖ ఆర్డీవోగా పనిచేసిన హుస్సేన్ సాహెబ్, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈఆర్వో హరిదాసు, బీఎల్‌వో కిరణ్మయి, పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వో అనురాధలు కూడా ఇదే వేదికపై అవార్డులు అందుకున్నారు.

మేయర్ మార్పుపై కూటమిలో తర్జనభర్జన

- ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లలో భిన్నాభిప్రాయాలు
- అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాల్సిందేనంటూ కొందరి డిమాండ్
- ఏడాది కాలానికి మార్పు అవసరం లేదని మరికొందరి వాదన
- నేతల మధ్య జోరుగా చర్చ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ మేయర్ మార్పుపై కూటమి ప్రజా ప్రతినిధులు, నేతలు తర్జనభర్జన పడు తున్నారు. మరో రెండు నెలలకు గొలగాని హరివెంకట కుమారి మేయర్ పీఠం అధిష్ఠించి నాలుగు సంవత్సరాలు పూర్తవుతుంది. అప్పుడు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు అవకాశం లభిస్తుంది. కౌన్సిల్‌లో ప్రస్తుతం కూటమికి పూర్తిస్థాయి మెజారిటీ ఉన్నందున... ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కొంతమంది అభిప్రాయపడు తున్నారు. మరికొందరు మాత్రం ఏడాది కాలానికి మేయర్‌ను మార్చడం అనవసరమని, ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడుతుందంటూ వాదిస్తున్నారు.



మేయర్ హరివెంకట కుమారి

జీవీఎంసీకి 2021 మార్చిలో ఎన్నికలు జరిగాయి. 98 వార్డులకుగానూ అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ 60 వార్డులను గెలుచుకుంది. ఇండిపెండెంట్లుగా గెలిచిన నలుగురు కూడా వైసీపీకి మద్దతు తెలిపారు. దీంతో 11వ వార్డు కార్పొరేటర్‌గా ఎన్నికైన గొలగాని హరివెంకటకుమారిని మేయర్‌గా ఎంపిక చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీతో కూడిన కూటమి అధికారంలోకి వచ్చింది. దీనిప్రభావం జీవీఎంసీ కౌన్సిల్‌పై పడింది. ఇండిపెండెంట్లుగా గెలిచి వైసీపీలో చేరిన నలుగురితోపాటు వైసీపీకి చెందిన సుమారు 15 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరారు. దీంతో కౌన్సిల్‌లో వైసీపీ బలం 40కి పడిపోగా, కూటమి బలం 55కి పెరిగింది. వీరుకాకుండా జీవీఎంసీ పరిధిలోని అన్ని అసెంబ్లీ స్థానాలను, పార్లమెంటు స్థానాలను కూటమి కైవసం చేసుకోవడంతో ఎక్స్‌అఫిషియో

... మిగతా 8వ పేజీలో

కాశీలో రోడ్డు ప్రమాదం

- మల్కాపురం ప్రాంతానికి చెందిన బాలుడి మృతి
- మరో పది మందికి గాయాలు
- కుంభమేళాకు వెళ్లివస్తుండగా దుర్ఘటన



ప్రమాదంలో మృతి చెందిన బాలుడు జీవన్ (ఫైల్ ఫొటో)

మల్కాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

కుంభమేళాకు వెళ్లిన నగరంలోని మల్కాపురం ప్రాంతవాసులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో పది మంది గాయపడ్డారు. అయితే అందరూ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో ఉండడంతో ప్రమాద సమాచారం ఆలస్యంగా వెలుగుచూసింది. స్థానిక శెట్టిబలిజ వీధికి చెందిన 11 మంది ఈ నెల 17న ఇక్కడి నుంచి కారులో ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వెళ్లారు. అక్కడి నుంచి వారణాశి వస్తుండగా 21వ తేదీన వీరి వాహనం రోడ్డు పక్కన

... మిగతా 8వ పేజీలో

వీఆర్‌లోని సీఐలకు పోస్టింగ్‌లేవి?

- రాజకీయ సిఫారసులకే ప్రాధాన్యం
- పోలీస్ శాఖలో పెద్దఎత్తున చర్చ

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. కమిషనరేట్‌లో నెలల తరబడి వెయిటింగ్‌లో ఉన్నవారిని విస్మరించి రాజకీయ సిఫారసులతో రేంజ్ నుంచి నగరానికి వచ్చిన వారికే పోస్టింగ్‌లు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగర కమిషనరేట్‌లో నలుగురు సీఐలువీఆర్ (వేకెన్సీ రిజర్వ్)లో ఉన్నారు. స్పెషల్ బ్రాంచిలో మరో నలుగురు పనిచేస్తున్నారు. నగరంలో సీఐలను బదిలీ చేయాల్సి వచ్చినా, ఎవరిపైన అయినా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సి వచ్చినా వారి స్థానంలో వీఆర్ లేదా ఎస్‌బీలో ఉన్నవారికి తాత్కాలికంగా లేదా రెగ్యులర్ పోస్టింగ్ ఇవ్వడం పరిపాటి. అయితే రేంజ్ పరిధిలోని సీఐలతోపాటు ఇక్కడ పనితీరు సంతృప్తిగా లేక గతంలో రేంజ్‌కు బదిలీ అయినవారిలో కొందరు రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఇటీవల కమిషనరేట్‌కు బదిలీ చేయించుకుంటున్నారు. నగరానికి వచ్చిన వెంటనే వీఆర్‌లోనో, నాన్‌ఫోకల్ పోస్టింగ్‌లు అయిన సీసీఆర్‌బీ, సీసీఎస్, పీటీసీ,ఎస్‌బీ వంటి విభాగాల్లో కాకుండా కీలకమైన స్టేషన్లలో పోస్టింగ్ దక్కించుకుంటున్నారు. దీంతో వీఆర్, ఎస్‌బీలో నెలలుగా పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్న వారంతా తీవ్ర నిరాశకు గురవుతున్నారు.


కొమ్మాది : స్వస్తిక్ ఆకారంలో చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు



భీమిలిలో ఓటర్ల దినోత్సవం ర్యాలీ


పద్మనాభం రూరల్ : రెడ్డిపల్లి పాఠశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆనందరావు

ఓటరుగా నమోదు ప్రతిఒక్కరి బాధ్యత

- ఓటు ప్రాధాన్యాన్ని ప్రజలు తెలుసుకోవాలి
- అధికారుల పిలుపు
- నియోజకవర్గంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. భీమిలి ఆర్డీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏవో మనోరంజని, తహసీల్దార్ పైలా రామారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటుహక్కు ప్రాధాన్యత తెలుసుకుని, చైతన్యవంతులు కావాలన్నారు. దేశానికి మంచి భవిష్యత్ అందించేలా ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. అనంతరం ఐదుగురు సీనియరు సిటిజన్లను సత్కరించారు. అలాగే కొత్తగా ఓటుహక్కు వచ్చిన వారికి గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఓటరు నమోదులో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డెడిప్యూటీ తహసీల్దార్ శ్రీనుబాబు, ఎన్నికల డిటి భాస్కరరావు, ఎంఈవో-2 జయప్రద, డైట్ అధ్యాపకులు సారిపిల్లి త్రినాథరావు, జె.మాధవి, అల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఎస్వీఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. భీమిలి మండలం చిప్పాడ జడ్పీహెచ్ఎస్,భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఎంవీటీ రత్నం, రేఖ అప్పారావు, రమణ పాల్గొన్నారు.

పద్మనాభం రూరల్ : ఓటు హక్కు ప్రాధాన్యంపై ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని తహసీల్దార్ కె. ఆనందరావు అన్నారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నా ఓటు.. నా బాధ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అలాగే విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ శ్యామల, సర్వే డీటీ వరలక్ష్మి,హెచ్ఎం సన్యాసిరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కొమ్మాది : అర్హత ఉన్నవారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గొట్టేటి రవి అన్నారు. పాఠశాలలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. అంతకముందు విద్యార్థులు స్వస్తిక్ ఆకారంలో నిలబడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల పిడి పాషా, నాగమణి, అనిల్, మురళీ, ఉపాధ్యాయులు శ్రీను, సోమేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

సింహాచలం : యువత భారత రాజ్యాంగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పిలుపునిచ్చారు. అడివివరం శాఖా గ్రంథాలయంలో జరిగిన సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎందరో మహనీయులు రాజ్యాంగాన్ని ఉన్నత విలువలతో తయారు చేశారని, దేశ ప్రజలకు హక్కులు, బాధ్యతలు ఇచ్చిన రాజ్యాంగం పట్ల పౌరులకు కనీస అవగాహన అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నరసింహం, బీజేపీ నాయకులు రచ్చ శ్రీనివాస ఆనందవర్మ, వేమూరి మహేశ్, కె. రామకృష్ణ, పాల్గొన్నారు.

29న అప్పన్న తెప్పోత్సవం

ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకే భక్తులకు దర్శనాలు

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నస్వామి తెప్పోత్సవం ఈనెల 29న నిర్వహించనున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆలయంలో జరిగే వార్షికోత్సవాల్లో భాగంగా ఏటా పుష్యమాస బహుళ అమావాస్య నాడు కొండదిగువ పుష్కరిణిలో తెప్పోత్సవం జరపడం ఆనవాయితీ.ఈమేరకు బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారిని పల్లకిపై మెట్ల మార్గంలో తీసుకువచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన హంసాకృతి నౌకలో ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో ఊరేగిస్తారు. ఉత్సవం పురస్కరించుకుని ఆ రోజు సాయంత్రం 6 వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈఓ చెప్పారు.

ప్రభుత్వ రంగంలోనే ఉక్కు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగనుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తెలిపారు. శనివారం ఆయన 98వ వార్డులో పార్టీ నాయకుడు రచ్చా ఆనంద శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ కృషి వల్ల కేంద్రం ఉక్కుకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడం హర్షనీయమన్నారు.త్వరలో మరిన్ని నిధులు మంజూరు కానున్నట్టు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటుపరం కాదన్నారు.

హనీ ట్రాప్ కేసులో ఏడుగురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లతా మాధురి

మహారాణిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలిలో ఓ వ్యక్తిని ట్రాప్ చేసి దోపిడీకి పాల్పడిన కేసులో కుప్పిలి ఆశారాణితో సహా ఏడుగురిని అరెస్టు చేసినట్టు క్రైమ్ డీసీపీ కె. లతామాధురి తెలిపారు. శనివారం పోలీసు కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ముంజి రామారావు వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 18, 19 తేదీల్లో గుర్తు తెలియని మహిళ నుంచి ఫోన్ వచ్చింది. మీరు నాకు బాగా తెలుసు.. కలుద్దామని తెలపడంతో, ఎవరో తెలుసుకునేందుకు ఆమె చెప్పిన ప్రదేశానికి 19న సాయంత్రం వెళ్లాడు. అక్కడకు ద్విచక్ర వాహనాలపై వచ్చిన ఆరుగురు అతడ్ని పట్టుకొని నీకు ఫోన్ చేసిన మహిళ కనిపించడం లేదు.. ఆమెను ఏంచేశావో చెప్పు అంటూ భయపెట్టారు. అనంతరం బలవంతంగా విజయనగరం వెళ్లే రహదారిలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కొట్టారు. అతని వద్ద రూ.40 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కుని, అతని మొబైల్ నుంచి ఫోన్ పే ద్వారా రూ.10 వేల బదిలీ చేసుకున్నారు. కొన్ని రోజులు భయంతో ఉన్న రామారావు సన్నిహితుల సలహాతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకుని, వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు విజయనగరం జిల్లాకు చెందిన బంగారి చక్రధర్ (37), డోలా లక్ష్మణరావు (26), ఇంటి సురేశ్ (30), వాల్తేరుకు చెందిన బరికి స్వామి (25), ములపర్తి వెంకటేష్ (29), వాసుపల్లి శ్యామ్‌ప్రకాష్ (30), కంచరపాలెంకు చెందిన ఆశారాణి అలియాస్ శ్రావణిను అరెస్టు చేసినట్లు తెలిపారు. దోపిడీకి పాల్పడిన వారంతా కరడుగట్టిన నేరస్తులని, అనేక దొంగతనాలు, హత్యా నేరాలలో నిందితులని డీసీపీ లతామాధురి వివరించారు.

శరవేగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం


గంట స్తంభం వద్ద నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్‌లో చేపట్టిన మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది. గంట స్తంభం వద్ద నిర్మిస్తున్న ఈ దుకాణ సముదాయం ఈనెలాఖరుకు పూర్తి కావచ్చని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 11 దుకాణాలు నిర్మిస్తున్నారు. ఇందుకు జీవీఎంసీ రూ.1.50 కోట్లు మంజూరు చేసింది.

శిల్పారామంలో బోట్ క్లబ్‌ను పునరుద్ధరించాలి


చెరువు పక్కన వృథాగా పడిన ఉన్న జెట్టీ

మధురవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో బోట్ క్లబ్‌ను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు. పదేళ్ల క్రితం ప్రైవేటు సంస్థ సందర్శకుల కోసం శిల్పారామం చెరువులో బోట్ క్లబ్ ఏర్పాటు చేసింది. చెరువు ఒడ్డున జెట్టీ నిర్మించి నాలుగు ఫైబర్ బోట్లు, రెండు పెడల్ బోట్లు అందుబాటులో ఉంచింది. నామమాత్రపు ఫీజు తీసుకొని నలుగురు పర్యాటకులకు ఒక పడవ ఇచ్చేవారు. వారు సొంతంగా పడవను నడిపి, ఆనందపడేవారు. అప్పట్లో దీనికి మంచి ఆదరణ ఉండేది. కాలక్రమంలో చెరువులో నీరు ఎండిపోవడంతో పాటు జెట్టీ నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో ప్రారంభించిన మూడేళ్ల తరువాత బోట్ క్లబ్ మూతపడింది. చెరువుకు మోటార్ల పంపింగ్ ద్వారా నీటిని పంపించి బోట్ క్లబ్‌ను పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

గొల్లలపాలెంలో పశు వైద్య శిబిరం

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గొల్లలపాలెం కృష్ణాకాలనీలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిబిరాన్ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందన్నారు. రైతులు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్,సహాయ సంచాలకులు బీవీ రమణ, ఎల్ఎస్ఏ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న సినీ నటులు


స్వామివారి సన్నిధిలో హీరో శ్రీకాంత్, నటుడు చంద్రకాంత్(చిట్టి)

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని సినీ నటులు శ్రీకాంత్, చంద్రకాంత్ (చిట్టి) శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ పర్యవేక్షణాధికారి ప్రసాద్ స్వాగతం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న వారి గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ తెలుగు ప్రేక్షక దేవుళ్ల అభిమానం ఎప్పటికీ మరువలేనిదన్నారు. విజయశాంతి, కల్యాణ్‌రామ్ నటిస్తున్న షూటింగ్ దశలో ఉన్న సినిమాలో, మెగాస్టార్ చిరంజీవి కుమార్తె చేస్తున్న గోల్డ్ బాక్స్ అనే వెబ్ సీరీస్‌లో నటిస్తున్నానని తెలిపారు. సాయిధర్మతేజ్ నటిస్తున్న మరో చిత్రంలోనూ నటిస్తున్నానని చెప్పారు.

శతాబ్ది ఉత్సవ్ ఆటల పోటీలు ప్రారంభం


క్యారమ్స్ పోటీని ప్రారంభిస్తున్న గాడు అప్పలనాయుడు, లక్ష్మణరావు

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విద్యార్థులకు శనివారం నుంచి ఆటల పోటీలు ప్రారంభించారు. క్యారమ్స్‌ను ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలనాయుడు, లక్ష్మణరావు, చెస్ పోటీలను పాఠశాల హెచ్ఎం రమణ, ఉత్సవ కమిటీ కోశాధికారి పూసర్ల శ్రీనువాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ్ కమిటీ ఉపాధ్యక్షులు ఎంవీ పార్వతీశం, కాళ్ల సన్నీ, రాజేటి బసవ కృష్ణమూర్తి, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు భీమారావు, చౌదరి సత్యరాజు, లచ్చుబుగత గణపతి, కనకల సన్యాసినాయుడు, మారోజు గోపి పాల్గొన్నారు. కాగా ఉత్సవాల సందర్భంగా 2న పాఠశాల పూర్వ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది.

గాయత్రిలో చాగంటి ప్రవచనాలు


చాగంటి కోటేశ్వరరావుతో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మనిషి ఎలా జీవించాలో చెప్పేదే రామాయణం అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ శ్రీరాముడి నడవడికే ధర్మమని, ఆయన గురువుకు ఎంత ప్రాధాన్యత ఇచ్చారో గురువు వైభవం తెలియజేస్తుందన్నారు. మంచి మాటలు మాట్లాడడం కూడా తపస్సు వంటిదేనని చెప్పారు. కాగా తొలిరోజు రామాయణం వైభవం, నారదుడు వాల్మీకి మహర్షికి చెప్పిన సంక్షిప్త రామాయణం, రామాయణం ఆవిర్భావం వంటి వాటి గురించి చాగంటి వివరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్యసోమరాజు, కార్యక్రమ నిర్వాహకులు అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాశీలో రోడ్డు ప్రమాదం

... 7వ పేజీ తరువాయి

ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జు నుజ్జయి అందులో ఉన్నవారంతా తీవ్రంగా గాయపడ్డారు. జీవన్ (7) అనే బాలుడికి తీవ్రగాయాలు కావడంతో నాలుగు రోజులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం మృతిచెందాడు. క్షతగాత్రులందరికీ రెండేసి శస్త్రచికిత్సలు జరిగాయి. ఇంకా వారెవరూ కోలుకోలేదు. ప్రమాద విషయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలియడంతో కలెక్టర్‌కు సమాచారం అందింది. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం మేరకు ములగాడ మండల తహసీల్దార్ భుజంగరావు శనివారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

ఆర్టీఛీ కాంప్లెక్స్

... 7వ పేజీ తరువాయి

లేకుంటే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

తాగునీటికి అవస్థలు

ప్రయాణికుల కోసం స్వచ్ఛంద సంస్థ ఒకటి ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను రెండేళ్ల కిందట ఏర్పాటు చేసింది.దీనిని నిత్యం శుభ్రం చేయకపోవడంతో ట్యాంకులో నీరు అపరిశుభ్రంగా మారింది. అలాగే అక్కడే ఏర్పాటుచేసిన కొళాయిల హెడ్‌ల వద్ద నాచు పట్టేసింది. నీరు తాగేందుకు వెళ్లే వారికి అక్కడ అపరిశుభ్రతను చూస్తే ఒళ్లు జలదరిస్తుంది.

నాణ్యత లేని ఆహార ఉత్పత్తులు

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను మాత్రమే విక్రయించాల్సి ఉండగా, అధిక లాభార్జన కోసం వ్యాపారులు ఊరూపేరు కంపెనీలవి అమ్ముతున్నారు. బ్రాండెడ్ వస్తువును పోలి ఉండేలా ప్యాకింగ్ కలిగిన వస్తువులు, వాటర్ బాటిళ్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరోమార్గం లేక ప్రయాణికులు వాటినే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రయాణికుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిసినప్పటికీ అధికారులు మాత్రం చూసీచూడనట్టు వదిలేస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం

- అప్పలనాయుడు, రీజినల్ మేనేజర్

ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. పరిశుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచడం కోసం ప్రతిరోజూ తనిఖీలు చేస్తున్నాం. దీనివల్ల గతంతో పోల్చితే పరిస్థితులు బాగున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ ఇంకా మెరుగుపడాల్సి ఉందని నిర్వాహకులకు చెప్పాం. సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. కాంప్లెక్స్ ఆవరణలోని వ్యాపారులు ఎంఆర్‌పీకే విక్రయించాలని, నాణ్యత లేని పదార్థాలను అమ్మకూడదని ఇటీవలే సమావేశం పెట్టి హెచ్చరించాం. కుక్కల సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళతాం.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి సుప్రభాత సేవలు యథావిధిగా జరిపారు.ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

దేవదాయ శాఖ నూతన కమిషనర్‌కు ఉద్యోగుల సంక్షేమ సంఘం అభినందనలు


నూతన కమిషనర్‌తో ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖ రాష్ట్ర నూతన కమిషనర్‌గా నియమితులైన కోదూరు అచ్యుత రామచంద్రమోహన్‌ను ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సంక్షేమ సంఘం కలిసి అభినందనలు తెలిపింది. శుక్రవారం సాయంత్రం గొల్లపూడిలోని ఆ శాఖ ప్రధాన కార్యాలయంలో కార్యవర్గం కమిషనర్‌ను కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు డీవీఎస్ రామరాజు (హరి), ఉపాధ్యక్షుడు, సింహాచలం దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, విజయవాడ దేవస్థానం అర్చకుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

పెంట-గంధవరం రోడ్డుకు మరమ్మతు

పద్మనాభం రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంట గ్రామం నుంచి గంధవరం రోడ్డు, పాండ్రంగి నుంచి సంగివలస రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవ వల్ల ఆయా రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. భీమిలి ఆర్అండ్‌బీ డీఈఈ శనివారం ఈ పనులను పరిశీలించారు.

200 మందికి వైద్య పరీక్షలు

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 98వ వార్డులోని ప్రైవేటు కల్యాణ మండపంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బీజేపీ వార్డు మాజీ అధ్యక్షుడు వేమూరి మహేశ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మందికి పరీక్షలు చేసి,మందులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు శరత్‌కుమార్, కె. రామకృష్ణ, గురుకిశోర్, రాజా పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీలు వితరణ

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ వార్డు తోటవీధి మత్స్యకారులకు దివీస్ కంపెనీ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా సిమెంట్ బెంచీలను వితరణగా అందజేసింది. ఈ సందర్భంగా కంపెనీ సీఎస్ఆర్ మేనేజరు సురేశ్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులు చేపల వేటకు వెళ్లేటప్పుడు, వేట నుంచి తిరిగి వచ్చినప్పుడు సేద తీరడానికి బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకుడు గంటా నూకరాజు, దినకరన్, సొరకాల రమణ, బర్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజుకు సన్మానం

భీమునిపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు ఎం. పరశురామరాజును పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా సన్మానించారు. గాడువీధిలో ఉన్న పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా నియోజకవర్గ కన్వీనరు రామానాయుడు ఆధ్వర్యంలో నాయకులు పరశురామరాజును సన్మానించారు. అనంతరం పరశురామరాజు మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. సమావేశంలో నాయకులు చక్రవర్తి, శ్రీహరి, అప్పారావు, ప్రసాదరావు పట్నాయక్, సునీత, విజయ, తదితరులు పాల్గొన్నారు.

మేయర్ మార్పుపై కూటమిలో తర్జనభర్జన

... 7వ పేజీ తరువాయి

సభ్యులుగా మరో పది మంది ఉన్నారు. దీంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారిని గద్దె దింపి, తమ కార్పొరేటర్‌ను మేయర్ పీఠంపై కూర్చోబెట్టేందుకు సరిపడా బలం కూటమికి చేకూరింది. కానీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే ఎన్నికై కనీసం నాలుగేళ్లు పూర్తవ్వాలనే నిబంధన మునిసిపల్ చట్టంలో ఉంది. ఇది అవిశ్వాసం పెట్టేందుకు అడ్డంకిగా మారింది. కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానిక సంస్థల ఛైర్మన్‌లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు వెసులుబాటు కలిగేలా మునిసిపల్ చట్టానికి సవరణ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ అందుకు సీఎం చంద్రబాబునాయుడు ససేమిరా అన్నారు. ఇక జీవీఎంసీ విషయానికి వస్తే ఈ ఏడాది మార్చి నాటికి కౌన్సిల్ ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తవుతుంది. దీంతో మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి అడ్డంకి తొలగిపోతుంది. ఈ నేపథ్యంలో మేయర్ మార్పుపై కొద్దిరోజులుగా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

కూటమిలో భిన్నాభిప్రాయాలు

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ దీనిపై కూటమి నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఏడాది మాత్రమే కౌన్సిల్ పదవీకాలం ఉన్నందున, ఇప్పుడు మేయర్‌ను మార్చితే అన్యాయంగా దింపేశారని ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కొందరు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు అంటున్నారు. మరికొందరు మాత్రం ఏడాది కాలమైనాసరే వైసీపీ నుంచి మేయర్ పీఠాన్ని గుంజుకోవాల్సిందేనని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఛైర్మన్‌లు, మేయర్‌ల మార్పుపై సీఎం చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

దేశ ప్రజలకు రక్షణ కవచం రాజ్యాంగం



ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీలో అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ ప్రతిని చూపిస్తున్న ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర్లు, లైబ్రరీ సిబ్బంది

- ఏయూ లైబ్రరీలో రాజ్యాంగ ప్రతి
- నేడు గణతంత్ర దినోత్సవం

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): **మన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందంటే దానికి రాజ్యాంగమే కారణం. ప్రతి వ్యవస్థ రాజ్యాంగం ప్రకారమే పనిచేస్తోంది. ప్రజల హక్కులకు రక్షణ, బాధ్యతలను రాజ్యాంగమే గుర్తుచేస్తోంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.**

భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ఆ రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. రాజ్యాంగ ముసాయిదా కొన్ని ప్రతులను చేతిరాతతో రాయించారు. వీటిపై రాజ్యాంగ పరిషత్ సభ్యులు 208 మంది సంతకాలు చేశారు. తొలి 15 మందిలో ఏడుగురు తెలుగువారు ఉండగా, ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకరు కావడం గమనార్హం. ఏటా గణతంత్ర దినోత్సవాన్ని ప్రత్యేకంగా ఒక థీమ్‌తో జరుపుతారు. ఈ ఏడాది స్వర్ణ భారత దేశం : వారసత్వం - పురోగతి థీమ్‌తో నిర్వహిస్తున్నారు. చేతితో రాసిన రాజ్యాంగ ముసాయిదా ప్రతిని 1957లో ఏయూ లైబ్రరీలో పొందుపరిచారు.

మార్గదర్శకం : దేశంలోని చట్టాలు అందరికీ సమానంగా పని చేసేలా రాజ్యాం గమే మార్గదర్శనం చేస్తోంది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజ లు రక్షణ పొందడానికి రాజ్యాం గమే కవచంలా ఉపకరిస్తోందని నిపుణులు చెబుతున్నారు. దేశంలో ఆర్థిక, అంగ బలాలకు, రాజకీయ ప్రాబల్యాన్ని తట్టుకుంటూ సాధారణ ప్రజలు రక్షణ పొందగలగడం రాజ్యాంగం కల్పించిన హక్కులే. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజ్యాంగ మౌలిక స్వరూపం మారకుండా ఆర్టికల్స్‌లో సవరణలు చేసుకునే అవకాశాన్ని రచన కమిటీ కల్పించింది.

ఏయూలో రాజ్యాంగ ప్రతి

రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఏడేళ్ల తరువాత రాజ్యాంగ ప్రతి ఏయూకు వచ్చింది. అప్పటి నుంచి దీన్ని అత్యంత జాగ్రత్తగా భద్రపరుస్తున్నాం. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రదర్శనకు ఉంచి విద్యార్థులకు తెలియజేస్తున్నాం. దేశంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఈ ప్రతిని పంపించారు. దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటి ఏయూ కావడంతో ఇక్కడకు ప్రతిని పంపారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు ఏయూకు మాత్రమే ఈ ప్రతులు వచ్చాయి. వర్సిటీలోని పలువురు విద్యార్థుల పరిశోధనకు ఇది ఎంతగానో ఉపయోగ పడింది.

- పి వెంకటేశ్వర్లు, చీఫ్ లైబ్రేరియన్, ఏయూ

రాజముద్ర


రాజ్యాంగం గొప్పతనం విద్యార్థులకు తెలియాలి..



దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా బతుకుతున్నాడంటే దానికి రాజ్యాంగం కల్పించిన హక్కులే కారణం. అందుకు తగ్గట్టు బాధ్యతలను నిర్వర్తించాలి. ఏళ్లు గడుస్తున్నా దేశంలో ప్రజాస్వామ్యం విరాజిల్లుతోందంటే దానికి మూల కారణం రాజ్యాంగమనే విషయాన్ని గుర్తించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకునేందుకు కొందరు యత్నిస్తున్నా.. ప్రజాస్వామ్య దేశంలో అవి సాధ్యం కాదు. ఈ తరహా చర్యలను ప్రజలతోపాటు రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తాయి. అదే రాజ్యాంగం గొప్పతనం. రాజ్యాంగ రచనకు అప్పట్లో మేధావులు శ్రమించిన తీరు, దీనితో ప్రజలకు కలుగుతున్న మేలు గురించి నేటి తరం విద్యార్థులకు తెలియజేయాలి. గణతంత్ర దినోత్సవం గురించి చాలా మంది విద్యార్థులకు అవగాహన ఉండడం లేదు. ఇది బాధాకరం.

- ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం, ఏయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి


బాలికా సదనం సందర్శించి అధికారులకు సూచనలిస్తున్న ఏపీ హోంమంత్రి, (ఇన్‌సెట్‌లో) విలేకరులతో మాట్లాడుతున్న వంగలపూడి అనిత

చిన్నారుల సమస్యను రాజకీయం చేయడం తగదు

- వైసీపీ నేతలకు రాష్ట్ర హోంమంత్రి అనిత హితవు
- బాలికా సదనంలో సమస్య పరిష్కారం అయిందంటూ వెల్లడి

ఆరిలోవ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) :బాలికల సదనం హోంలో సమస్యను సకాలంలో స్పందించి పరిష్కారం చూపామని, దీన్ని వైసీపీ శ్రేణులు రాజకీయం చేయడం తగదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శనివారం ఆమె చినగదిలిలోని బాలిక సదనం, పరిశీలన గృహాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమస్య తనకు తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, సీపీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. సున్నితమైన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించినట్టు చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పిల్లలను వారి ఇళ్లకు పంపినట్టు చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన బాలిక సమస్య న్యాయస్థానంలో ఉందని, కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.తాను సదన్‌లో ఒక్కో బాలికతో వ్యక్తిగతంగా మాట్లాడానని, వారి సమస్యలను తెలుసుకున్నానన్నారు. చిన్నారులు కావడంతో కొన్ని పరిణామాలు ఎదురు కావడంతో మానసిక ఒత్తిడికి గురై ఆవేదనకు లోనయ్యారని హోంమంత్రి అన్నారు. ఇక్కడి చిన్నారులకు కౌన్సెలింగ్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్న ట్టు చెప్పారు. ప్రతి విషయాన్ని భూతద్దంతో చూడడం, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాన్ని వైసీపీ నేతలు మానుకోవాలని హోంమంత్రి హితవు పలికారు. ఈ సమస్యను చాకచక్యంగా పరిష్కరించిన ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, శిశు, సంక్షేమ శాఖ అధికారులను హోంమంత్రి అభినందించారు. ఆమె వెంట బాలికల హోం సదనం సూపరింటెండెంట్ సునీత తదితరులు ఉన్నారు.

చిన్నారులతో ముచ్చటించిన హోంమంత్రి

అంతకుముందు బాలికల సదనంను సందర్శించిన హోంమంత్రి అనిత అక్కడ ఉన్న బాలికలు ఒక్కొక్కరికితో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. గృహసిబ్బంది, పర్యవేక్షణ అధికారులు, వైద్యులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.మానసిక వైద్యులతో చిన్నారులకు కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.

కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ, మానసిక వైద్యశాల ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, శిశు-మహిళా సంక్షేమశాఖ పీడీ జయదేవి, పర్యవేక్షణాధికారి సునీత పాల్గొన్నారు.

ఓటు విలువను అందరూ గుర్తించాలి : జేసీ


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మయూర్ అశోక్

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు విలువను ప్రతి ఓటరూ గుర్తించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. శనివారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి జేసీ, ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబులు ప్రారంభించారు. అనంతనం జేసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతి పౌరుడు ఓటరుగా నమోద వ్వడంతో పాటు చుట్టుపక్కలవారు కూడా నమోదయ్యే లా ప్రోత్సహించాలన్నారు. ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద కానీ ఎన్నికల సంఘం మొబైల్ యాప్‌లో గానీ ఓటరుగా నమోదు కావాలన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌వో భవానీశంకర్, ఆర్డీవో కె.సంగీత్ మధుర్, ఎస్డీసీలు ఎస్.మధుసూదనబాబు, జె.సీతారామారావు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

వీఎంఆర్డీఏలో జాతీయ ఓటర్ల దినోత్సవం

సిరిపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్డీఏ కార్యాలయంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.

వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఉద్యోగులు, సిబ్బందితో విశ్వాసంతో మన దేశ సంప్రదాయాలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ప్రశాంతంగా ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతాయని ప్రతిజ్ఞ చేయించారు. ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తానని వారందరితో చెప్పించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ అకౌంటెంట్ ఆఫీసర్ హరిప్రసాద్, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ కళలకు జీవంపోయాలి

కుమార్తె నృత్య ప్రదర్శన చూసి మురిసిన హోంమంత్రి అనిత


నృత్య ప్రదర్శన ఇస్తున్న రేష్మిత

మద్దిలపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారతీయ సంప్రదాయ కళలకు జీవం పోయాల్సిన బాధ్యతభారతీయులు అందరిదని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన కూచిపూడి డాన్స్ అండ్ మ్యూజిక్ 43వ వార్షికోత్సవంలో హోంమంత్రి కుమార్తె రేష్మిత నృత్య ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హోంమంత్రి మాట్లాడుతూ భారతీయ సంస్కృతీసంప్రదాయాలు భావితరాలకు అందించాలనే తపనతో అమెరికాలో స్థిరపడిన నృత్యకారిణులు ఇక్కడ ప్రదర్శనలు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. చాలా వరకు పాశ్యాత్య పోకడలకు లోనై భారతీయ సంప్రదాయ నృత్యాలకు చిన్న చూపు చూస్తున్న నేపథ్యంలో కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఒడిస్సీ వంటి నృత్య కళలకు ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ వేడుకకు అతిథిగా రాలేదని, తల్లిగా వచ్చానని చెప్పారు. ఇలాంటి వేదికపై తన కుమార్తె రేష్మిత కూచిపూడి నృత్య ప్రదర్శన తన అదృష్టంగా భావిస్తున్నాని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ హోంమంత్రి అనిత కుమార్తె రేష్మిత అద్భుత ప్రదర్శన ఇచ్చారని ప్రశంసించారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వహకులు భరణి, కళాకారులు పాల్గొన్నారు.

పోలీసులకు చుక్కలు చూపించిన కిలేడీ దంపతులు

- అరెస్టు చేసి ఒంగోలు నుంచి తీసుకొస్తుండగా కారుతో లారీకి ఢీ
- రెండు ఫిర్యాదులపై ఎంవీపీ స్టేషన్‌లో కేసు నమోదు


పోలీసులు అరెస్టు చేసిన చంద్రశేఖర్, భాగ్యరేఖ

ఎంవీపీ కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : తన భర్త మస్నెందొర చంద్రశేఖర్ పెద్ద వ్యాపారవేత్త అని, తాను మానవ హక్కుల కమిషన్‌లో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నానంటూ పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడిన భాగ్యరేఖ దంపతులు అరెస్టు చేసే సమయంలో ఎంవీపీ పోలీసులకు చుక్కలు చూపించారు. వీరిని ఒంగోలులో అదుపులోకి తీసుకుని, రెండు వాహనాల్లో తీసుకొస్తుండగా మార్గంమధ్యలో అతి చేశారు. తొలుత అనారోగ్యం అని చెప్పడంతో తుని సమీపంలో ఓ ఆస్పత్రికి పోలీసులు తీసుకెళ్లి వైద్యం అందించారు. నిందితులు తమ సొంత వాహనంలో పోలీసులను అనుసరిస్తూ కొన్ని చోట్ల వేగంగా వెళ్లడం, మరికొన్ని చోట్ల బాగా నెమ్మదిగా వస్తూ ఇబ్బందులకు గురిచేశారు.ఆనందపురం వద్ద ముందున్న ఓ లారీని ఢీకొట్టి హడావుడి చేశారు. దీంతో పోలీసులు అంబులెన్స్‌లోవారిని నగరానికి తీసుకొచ్చిచికిత్స చేయించారు.

ఇదీ కేసు!

వీరిపై వివిధ స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ఎంవీపీ స్టేషన్‌లో ఇద్దరి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంవీపీ కాలనీ ఫ్రెష్ ఛాయిస్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న రౌతు మధును 2015లో నిందితులు కలసి పరిచయం పెంచుకున్నారు. భర్త మస్నెందొర చంద్రశేఖర్ వ్యాపారవేత్తగా, భాగ్యరేఖ మానవ హక్కుల కమిషన్‌లో జాయింట్ కమిషనర్ అంటూ పరిచయం చేసుకున్నారు. భాగ్యరేఖ ఒక నకిలీ గుర్తింపు కార్డును కూడా చూపించింది. మధురవాడ లేదా పైనాపిల్ కాలనీలో టిడ్కో ఇళ్లు కేటాయిస్తామని మధు వద్ద దఫదఫాలుగా రూ.80 వేలు తీసుకున్నారు. అలాగే రమఅనసూయ అనే మహిళకు కూడా మాయమాటలు చెప్పి రూ.లక్ష తీసుకున్నారు. తర్వాత ఎలాంటి ఇళ్లూ కేటాయింపు జరగకపోవడం, ఫోన్‌లకు స్పందించకపోవడంతో బాధితులు ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉంటున్న చంద్రశేఖర్ దంపతులను నిలదీశారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే మీపై దొంగతనం కేసు పెడతానంటూ బెదిరించారు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో సదరు నకిలీ అధికారి, ఆమె భర్త ఉదంతం బయట పడింది.

రక్తదానంతో ప్రాణదానం : ఎమ్మెల్యే వెలగపూడి


రక్తదానం శిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ తదితరులు

ఎంవీపీ కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) :రక్తదానం చేయడం ద్వారా ప్రాణదాతలుగా ఆరవచ్చని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు వర్ధంతి నేపథ్యంలో ఎంవీపీ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శనివారం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటుచేసిన శిబిరంలో నియోజకవర్గం పరిధిలోని అన్ని వార్డుల నుంచి సుమారు 150 మంది రక్తదానం చేశారు. ప్రతి ఏటా తమ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్టు చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో విజయవంతంగా నడుస్తోందని, ఎందరో పేదలకు సేవలందిస్తోందన్నారు. వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, నాయకులు పోతనరెడ్డి, ఒమ్మి సన్యాసిరావు, కాళ్ల శంకర్, గొలగాని పోలరావు, బొట్ట వెంకటరమణ, ఒమ్మి అప్పలరాజు, బుడుమూరి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

అదృశ్యమైన ఇద్దరు బాలురు హైదరాబాద్‌లో లభ్యం

ఎం.వి.పి.కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలో అదృశ్యం అయిన ఇద్దరు బాలురను పోలీసులు హైదరాబాదులో శుక్రవారం రాత్రి పట్టుకొని విశాఖకు తీసుకొచ్చారు. ఈ కేసులో పోలీసులు చురుగ్గా వ్యవహరించి మూడు రోజుల్లోనే బాలల ఆచూకీ కనుక్కోగలిగారు.

హైదరాబాద్‌లో ఓ ఆటో ఎక్కినట్టు గమనించిన పోలీసులు సీసీ ఫుటేజీ సాయంతో వారి ఆచూకీ కనుక్కోగలిగారు. విశాఖ నగరంలోని నక్కవానిపాలెం క్రాంతినగర్‌కు చెందిన చాట్ల ధీరజ్ (13), చైతన్యనగర్‌కు చెందిన దత్తి యశ్వంత్ (14)లను తల్లిదండ్రులకు శనివారం అప్పగించారు. ఈ సందర్భంగా బాలుర తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 52, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 16, క్యారెట్ 28 దొండకాయలు 44, బంగాళ దుంపలు 25, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)46, బరబాటి 42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 38, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

ఓటు హక్కు ప్రాధాన్యంపై విద్యాసంస్థల్లో అవగాహన


మద్దిలపాలెం : కృషా కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు 18 ఏళ్లు నిండగానే ఓటు నమోదు చేసుకోవడమే కాకుండా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.సునీత పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు.. అంటే సాధారణంగా డిగ్రీ ద్వితీయ సంవత్సరం వచ్చేసరికి ఓటు హక్కుకు అర్హులు అవుతారన్నారు. ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో అతి పెద్దదైన ప్రజాస్వామ్యం దేశంలో ఓటుహక్కు కలిగి ఉండడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్ కిరణ్, యూబీఏ కో-ఆర్డినేటర్ రామారావు, అధ్యాపకులు పోలా ఉమామహేశ్వరరావు, ప్రతాప్, నాగేశ్వరరావు, బీఎల్వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరిలోవ : తోటగరువు ప్రాథమిక పాఠశాలలో బీఎల్వో సంజీవరావు, హెచ్‌ఎం విశ్వనాథ్ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాతీన, వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పై నుంచి జారిపడి వ్యక్తి మృతి

వేపగుంట జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అప్పన్నపాలెం దరి బాలాజీహిల్ వ్యూ రెసిడెన్సిలో ఉంటున్న జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి జి.వెంకటసత్యనారాయణ (47) ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వేపగుంట జోన్-8 కార్యాలయ పరిధి 92వ వార్డులో ట్యాక్స్ కలెక్టర్‌గా వెంకట సత్యనారాయణ విధులు నిర్వహించేవారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అపార్ట్‌మెంట్ గోడపై తువ్వాలు ఆరబెట్టడానికి వెళ్లి, అది ఎగరడంతో దాన్ని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ప్రమాదవశాత్తూ పిట్టగోడ పై నుంచి జారి కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో భార్య లత, కుమారుడు ఇంట్లో ఉన్నారు. ఒక్కసారిగా శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా తలకు తీవ్ర గాయాలతో సత్యనారాయణ కనిపించడంతో వారు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రక్తస్రావం అధికం కావడంతో అప్పటికే ఆయన మృతి చెందారు. సమాచారం అందుకున్న పెందుర్తి ఎస్ఐ అసిరతాత సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ కుమార్తెకు వివాహమై అమెరికాలో ఉంటుండగా, కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు.

మిషన్ వాత్సల్య నిధులు విడుదల

ఎంవీపీ కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : కొవిడ్ సమయంలో తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలకు ఇచ్చే ఆర్థిక సాయం నిధులు విడుదలైనట్టు మహిళా శిశు సంక్షేమం సాధికార శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి తెలిపారు. విశాఖ జిల్లాలో 398 మంది లబ్ధిదారులకు త్వరలోనే ఈ నిధులు వారి ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ నెలకు రూ.4వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ కానున్నట్లు చెప్పారు. కొవిడ్ సమయంలో వారి తల్లి లేదా తండ్రిని కోల్పోయిన వారి వయసు పద్దెనిమిదేళ్ల లోపు ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేశారు.ఆ పిల్లలకు పద్దెనిమిదేళ్లు వచ్చే వరకూ ఈ ఆర్థిక సాయం కొనసాగుతుంది.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

గోపాలపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంసం విక్రయాలను నిషేధిస్తూ వర్తకులకు జీవీఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. కబేళా సెలవు దినాల్లో మాంసం విక్రయాలు చేపట్టడం నిషేధం.

ఈ ఏడాది రిపబ్లిక్ డే ఆదివారం రావడంతో మాంసం వర్తకులు వ్యాపారం చేసే అవకాశం ఉండడంతో రెండు రోజుల ముందు నుంచే ఆయా ప్రాంతాల్లోని సంబంధిత జోనల్ కార్యాలయ సిబ్బంది మాంసం వర్తకులకు నోటీసులు అందజేశారు.

ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి ఆదివారం మాంసం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టనున్నది.

గాదిరాజు ప్యాలెస్‌లో అంతర్జాతీయ గ్రాండ్ ట్రేడ్ ఫెయిర్



ఎంవీపీ కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ ఉత్పత్తులతో ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలెస్‌లో గ్రాండ్ ట్రేడ్ ఫెయిర్ ప్రదర్శన శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఐఐజీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ ప్రదర్శనలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఫర్నిచర్, ఇంటీరియర్, దుస్తులు, జ్యూవెలరీ, లెదర్, జీవన శైలి, హ్యాండీ క్రాఫ్ట్, హ్యాండ్లూమ్, జ్యూట్ తదితర ఉత్పత్తులను అందుబాటులో ఉంచి విక్రయాలు చేస్తున్నట్లు సీసీజీ మార్కెటింగ్ అండ్ సర్వీసెస్ సీఈవో చందన చటర్జీ తెలిపారు. థాయ్‌లాండ్, ఇరాన్, మలేషియా, దుబాయ్, ఆఫ్ఘనిస్తాన్ మొదలైన దేశాలతో పాటు మన దేశంలోని 15 రాష్ట్రాలు ప్రదర్శనలో పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు.



డ్రై ఫ్రూట్స్ స్టాళ్ల వద్ద సందర్శకుల సందడి

బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటనతో ఎంపీ ఆనందం


బాలకృష్ణతో శ్రీభరత్ (ఫైల్‌ఫొటో)

డాబాగార్డెన్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మావయ్య నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ లభించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. స్వర్ణోత్సవాన్ని ఇటీవల జరుపుకొన్న బాలకృష్ణ తెలుగు సినిమా ఎదుగుదలకు ఎంతో అంకితభావంతో సేవ చేశారన్నారు. విభిన్న పాత్రలతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆయన ఎన్నో సంవత్సరాలుగా సమాజ సేవలో ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని శిఖరాలను అధిరోహించి, ఇంకా ఎన్నో గౌరవ పురస్కారాలు అందుకోవాలని కోరుకుంటున్నానన్నారు.

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం


రైల్వే డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన పి.రామచంద్రరావు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ) నూతన డిప్యూటీ సూపరింటెండెంట్ (డీఎస్పీ)గా పి.రామచంద్రరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. రైల్వే ప్రొటక్షన్ ఫోర్సుతో (ఆర్పీఎఫ్) సమన్వయంతో మాదక ద్రవ్యాల రవాణా, ఇతర అక్రమ రవాణా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ రామచంద్రరావుకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిహెచ్.ధనుంజయనాయుడు, లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె.శాంతారామ్, అబ్దుల్ మారూఫ్, ఎస్.రామారావు, కె.టి.ఆర్.లక్ష్మి, వి.బాలాజీరావు, మధుసూదనరావు, షరీఫ్, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్‌ను వినియోగించుకోవాలి

మహారాణిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనానికి పాటించవలసిన పరిశుభ్రత అలవాట్లపై అవగాహన కల్పించే వెల్‌నెస్ క్లినిక్ సెంటరును దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ శనివారం కేజీహెచ్‌లోని గైనిక్ విభాగంలో ప్రారంభించారు. వైద్య కళాశాల ఉన్న చోట ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రంలో సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గైనిక్ మెడికల్, పీడియాట్రిక్ న్యూట్రీషన్‌పైన, మానసిక, శారీరక పటుత్వంపై అవగాహనకు, పలు వైద్య పరీక్షలు నిర్వహించటానికి ఈ వెల్‌నెస్ సెంటరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సేవలు సోమ, బుధవారాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవిలతా, వివిధ విభాగాల అధిపతులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వంశీకృష్ణతో చర్చిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

ఫుడ్‌కోర్టులో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు


ఫుడ్‌కోర్టును సందర్శిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్/అల్లిపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తనపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం రాత్రి జీవీఎంసీ పరిధి 31వ వార్డులోని పాత జైల్‌రోడ్డులోని ఫుడ్‌కోర్టులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఫుడ్‌కోర్టులో ఉన్న నిర్వాహకులు, సందర్శకులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఫుడ్‌కోర్టులో ఎవరైనా అద్దెల వసూలుకు పాల్పడిన, ఒకరికే అధిక షాపులు కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాణ్యత, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. దందాలు, వసూళ్లకు ఎవరైనా పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కష్టపడి బతికే చిరువ్యాపారులపై దురుసుగా ప్రవరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను నిరంతరం పేదల కోసమే పనిచేస్తానని ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. తదుపరి అక్కడ అందిస్తున్న ఆహార పదార్థాలను రుచి చూశారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని దక్షిణ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ సూర్యాబాగ్ జోన్- 4 కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ సిబ్బంది, సీఓలు, ఆర్పీలతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరువయ్యేలా చూడాలన్నారు. జోనల్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్, ఏడీ డి.పద్మావతి, నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు ప్రారంభం

మురళీనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం 50వవార్డులో శనివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కొత్త కమ్యూనిటీ హాలు భవనాన్ని ఆరంభించారు. సాయిరాంనగర్‌లో దీన్ని రూ.25 లక్షలతో నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో తమ మార్కు చూపిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఇక్కడి ప్రజలకు మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 50వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కూన వెంకటరావు, టీడీపీ నాయకుడు ఎస్.వరప్రసాద్, కార్పొరేటర్ వి.ప్రసాద్ కూటమి నాయకులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో స్థానిక నాయకులు

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

అక్కయ్యపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మహావీర్ ఫౌండేషన్ ప్రతినిధులు సునీత, స్వాతి ఆధ్వర్యంలో జగన్నాథపురంలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం పుస్తకాలు, కంపస్ బాక్సులు, పెన్నులు తదితర సామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయిని ఎం.ఆశాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు స్టేషనరీ అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అయిదో తరగతి విద్యార్థి నిహాల్ గణతంత్ర దినోత్సవ చరిత్రను క్లుప్తంగా వివరించాడు. ఉపాధ్యాయులు ఏవీఎల్‌ఎస్ మాధురి, లలితాంబ, వరలక్ష్మి, గౌసియా బేగం పాల్గొన్నారు.

'మద్యం షాపుల్లో యాతలకు అన్యాయం'

అక్కయ్యపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల కేటాయింపుల్లో ప్రభుత్వం యాత కులస్తులకు తీవ్ర అన్యాయం చేసిందని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ, సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు అన్నారు. నరసింహనగర్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లు గీత వృత్తిదారులకు జీవనోపాధి అందించేందుకు ప్రభుత్వం మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు చేసిన ఆలోచన కేటాయింపుల్లో నీరుగారిపోయిందన్నారు. నూతన జనగణనను పరిగణనలోకి తీసుకోలేదని తప్పుపట్టారు. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో యాత కులస్తులు 90 శాతం మంది ఉన్నా సరైన పద్ధతిని అనుసరించలేదన్నారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, కె.అప్పలరాజు, నూకరాజు, ఆర్.రాజు పాల్గొన్నారు.

హనీ ట్రాప్ కేసులో మహిళ సహా ఏడుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లతా మాధురి

మహారాణిపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భీమిలిలో ఓ వ్యక్తిని హనీట్రాప్ చేసి దోపిడీకి పాల్పడిన కేసులో కుప్పిలి ఆశారాణి అనే మహిళ సహా ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు క్రైమ్ డీసీపీ కె.లతామాధురి తెలిపారు. శనివారం పోలీసు కమీషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు తెలియజేశారు. ముంజి రామారావు అనే వ్యక్తి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18, 19 తేదీల్లో గుర్తు తెలియని మహిళ నుంచి ఫోన్ వచ్చింది. మీరు నాకు బాగా తెలుసు.. కలుద్దామని తెలపడంతో, ఎవరో తెలుసుకునేందుకు ఆమె చెప్పిన ప్రదేశానికి 19 సాయంత్రం వెళ్లాడు. అక్కడకు ద్విచక్రవాహనాలపై వచ్చిన ఆరుగురు అతడిని భయపెట్టారు. అనంతరం బలవంతంగా విజయనగరం వెళ్లే రహదారిలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కొట్టారు. అతని వద్ద రూ.40 వేల నగదు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు. అనంతరం అతని మొబైల్ నుంచి ఫోన్ పే ద్వారా సుమారు రూ.10 వేల నగదును బదిలీ చేసుకున్నారు. కొన్ని రోజులు భయంతో ఉన్న రామారావు సన్నిహితుల సలహాతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక సాయంతో నిందితులను పట్టుకుని, వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితులు విజయనగరం జిల్లాకు చెందిన బంగారి చక్రధర్ (37), డోలా లక్ష్మణరావు(26), ఇంటి సురేష్ (30), వాల్తేరుకు చెందిన బరికి స్వామి (25), ములపర్తి వెంకటేష్ (29), వాసుపల్లి శ్యామ్‌ప్రకాష్ (30), కంచరపాలెంకు చెందిన ఆశారాణి అలియాస్ శ్రావణిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. దోపిడీకి పాల్పడినవారంతా కరడుగట్టిన నేరస్తులని, అనేక దొంగతనాలు, హత్యానేరాలలో నిందితులని డీసీపీ లతామాధురి వివరించారు.

జాబ్‌మేళాలో 47 మంది ఎంపిక

కంచరపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రాంగణ ఎంపికలో తమ సత్తా చాటారు. కళాశాల్లో ఇటీవల నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ బ్రాంచిలకు చెందిన 47మంది ప్రతిభ సాధించి ఉద్యోగాలు పొందినట్టు ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులకు శనివారం కళాశాల్లో నియామక పత్రాలను అందజేశారు. చెన్నైలోని సెయింట్ గోబైన్ గ్లాస్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ కంపెనీలో వీరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ విభాగం నుంచి 26 మంది, మెకానికల్ విభాగం నుంచి 13 మంది, సివిల్ విభాగం నుంచి 8 మందికి నియామక పత్రాలను కంపెనీ ప్రతినిధులతో కలిసి ప్రిన్సిపాల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు, ఆయా విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు, అధ్యాపకులు

పన్నుల వసూలు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న జోనల్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు

జ్ఞానాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సచివాలయ పరిపాలనాధికారులు ఆస్తి, ఖాళీ స్థలాలపై పన్నుల వసూలును వేగవంతం చేసి జోన్‌ను మొదటిస్థానంలో నిలబెట్టాలని జోనల్ అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు అన్నారు. శనివారం జోనల్ కార్యాలయంలో పలు వార్డుల పరిపాలన, రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒత్తిడి చేయకుండా పన్నుల చెల్లింపు ద్వారా నగరం ఏవిధంగా అభివృద్ధి సాధిస్తుందో నచ్చజెప్పి బకాయిలు రాబట్టాలన్నారు. సమావేశంలో ఆర్ఓ రాజ్యలక్ష్మి, ఆర్ఐలు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి


బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీఐ దేముడు బాబు

జగదాంబ కూడలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఇంటా, బయట అసభ్యంగా వ్యవహరిస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ దేముడుబాబు బాలికలను హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ క్వీన్ మేరీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు మంచి, చెడు స్పర్శ (గుడ్, బ్యాడ్ టచ్)లపై అవగాహన కల్పించారు. ఇంట్లోనూ, చదువుకున్న చోట ఎవరైనా వ్యక్తులు మాట కలిపి చనువుగా ప్రవర్తించేందుకు యత్నిస్తారని, వారు శరీరాన్ని తాకిన తీరును బట్టి చర్యలను గుర్తించగలగాలని ఉద్బోధించారు. బ్యాడ్ టచ్ చేసిన వ్యక్తిపై వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలపాలన్నారు. మొబైల్ చేతిలో ఉంటే ఫేక్ కాల్స్ చేసి మోసగిస్తారని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. చదువుపై దృష్టి సారించి మంచి మార్కులతో విజయం సాధించాలని పదో తరగతి విద్యార్థినులకు హితవు పలికారు. పాతనగరంలో బస్‌స్టాప్‌ల వద్ద ఆకతాయిలతో ఇబ్బందులుంటే పోలీస్‌లకు ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ముస్తాబు

మాధవధార/సీతమ్మధార, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) ; భారత గణతంత్ర వేడుకల నిర్వహణకు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కాలనీ సంక్షేమ సంఘాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆదివారం ఉదయం జెండా వందన కార్యక్రమంతో పాటు ప్రత్యేక సందేశం అందించే ప్రముఖుల రాకకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మురళీనగర్ వాకర్స్‌క్లబ్, వైశాఖీ పార్కులతో పాటు ఈ ప్రాంతంలోని రవాణాశాఖ కార్యాలయం, ఎక్సైజ్ శాఖ, కాలుష్య నియంత్రణ బోర్డు కార్యాలయాలు ఇంకా రాజకీయ పార్టీల కార్యాలయాల్లో వేడుకల నిర్వహణకు స్థానిక నాయకులు ఏర్పాట్లు చేపట్టారు. సీతమ్మధార సమీపంలోని కేఆర్‌ఎం కాలనీకి వెళ్లే రహదారి కూడలిలో 11 గ్రామాల ప్రజలు 2007 నుంచి భరతమాత విగ్రహానికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పూజలకు శ్రీకారం చుట్టి అనంతరం గణతంత్ర సంబరాలు, పరస, జాతర పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. అనంతర కాలంలో ఆచార్య కందర్ప విశ్వనాథ్ సొంత ఖర్చుతో 2015లో సుమారు 21 అడుగుల ఎత్తులో బందరు నుంచి ప్రత్యేక శిల్పులతో భరతమాత విగ్రహాన్ని తయారు చేయించారు. అప్పటి నుంచి ఏటా గణతంత్ర వేడుకల్లో ఉదయం పూలమాల వేసి 11 గ్రామాల ప్రజలు తమ దేశభక్తిని చాటుకుంటున్నారు. ఉన్నతాధికారులు, నాయకులు వచ్చి పూజల్లో పాల్గొని ప్రజలకు ఉత్తేజం కల్పిస్తారు. నక్కవానిపాలెం, కెఆర్‌ఎం కాలనీ, మద్దిలపాలెం, రేసపువానిపాలెం, చైతన్యనగర్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, సీతమ్మధార, పి అండ్ టి కాలనీ, గాంధీనగర్, క్రాంతినగర్, సీతమ్మధార ప్రాంతాల్లోని ప్రజలు భరతమాత విగ్రహం వద్ద గణతంత్ర వేడుకలకు సన్నాహాలు పూర్తిచేశారు.


కేఆర్‌ఎం కాలనీలో గణతంత్ర వేడుకలు జరుపుకొనే భరతమాత విగ్రహం

ప్లాస్టిక్ కవర్ల వినియోగం మానాలి

సీతమ్మధార, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులు, రైతుబజార్‌లో విక్రయిస్తున్న రైతులు, వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని, సూచనలు పాటించకపోతే చర్యలు తప్పవని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సోమనారాయణ హెచ్చరించారు. సీతమ్మధార రైతుబజార్, సమీపంలోని చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి

సీతమ్మధార రైతుబజార్‌కి జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి ఎస్‌కె యాసిన్ శనివారం సందర్శించారు. రైతుల కార్డులను పరిశీలించారు. ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి వద్ద రికార్డులు పరిశీలించారు. బజార్‌లో రైతులు తీసుకువస్తున్న కూరగాయలను పరిశీలించారు. నాణ్యమైన తాజా కూరగాయలను వినియోగదారులకు అందించాలని సూచించారు.


ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని సూచిస్తున్న అడిషనల్ కమిషనర్ సోమనారాయణ

'ఆలయం గోడలు కూల్చివేయడం దారుణం'

సీతమ్మధార, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార ఆర్ అండ్ బి క్వార్టర్స్ వద్ద గల వినాయకుడి ఆలయం పక్కనే ఉన్న అంజనేయస్వామి గుడి గోడలను జీవీఎంసీ సిబ్బంది అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేశారు. దీంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గోడలు పగులగొట్టిన గుడి వద్ద జై శ్రీరామ్ అంటూ శనివారం విశ్వహిందూ పరిషత్ నాయకులు నినాదాలు చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పూడి శెట్టి శర్మ, అభిరామ్, సురేష్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత ..ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను రైల్వే పోలీసులు పట్టుకుని వారి నుంచి రూ.30 వేలు విలువ చేసే ఆరు కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్‌ఐ శాంతారామ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ చిట్టిబాబు తన సిబ్బందితో శనివారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ప్రకాశం జిల్లాకు చెందిన షేక్ సాహుల్, మోట నవీన్ కలిసి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. విచారణ అనంతరం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని రైల్వే పోలీసులు తెలిపారు.

మేయర్ మార్పుపై కూటమిలో తర్జనభర్జన

... 7వ పేజీ తరువాయి

సభ్యులుగా మరో పది మంది ఉన్నారు. దీంతో మేయర్ గొలగాని హరివెంకటకుమారిని గద్దె దింపి, తమ కార్పొరేటర్‌ను మేయర్ పీఠంపై కూర్చోబెట్టేందుకు సరిపడా బలం కూటమికి చేకూరింది. కానీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలంటే ఎన్నికై కనీసం నాలుగేళ్లు పూర్తవ్వాలనే నిబంధన మునిసిపల్ చట్టంలో ఉంది. ఇది అవిశ్వాసం పెట్టేందుకు అడ్డంకిగా మారింది. కూటమి అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని స్థానిక సంస్థల చైర్మన్‌లు, మేయర్లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు వెసులుబాటు కలిగేలా మునిసిపల్ చట్టానికి సవరణ చేస్తారని ప్రచారం జరిగింది. కానీ అందుకు సీఎం చంద్రబాబునాయుడు ససేమిరా అన్నారు. ఇక జీవీఎంసీ విషయానికి వస్తే ఈ ఏడాది మార్చి నాటికి కౌన్సిల్ ఎన్నిక జరిగి నాలుగేళ్లు పూర్తవుతుంది. దీంతో మేయర్‌పై అవిశ్వాసం పెట్టడానికి అడ్డంకి తొలగిపోతుంది. ఈ నేపథ్యంలో మేయర్ మార్పుపై కొద్దిరోజులుగా తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

కూటమిలో భిన్నాభిప్రాయాలు

మేయర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే నెగ్గేందుకు అవసరమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ దీనిపై కూటమి నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరో ఏడాది మాత్రమే కౌన్సిల్ పదవీకాలం ఉన్నందున, ఇప్పుడు మేయర్‌ను మార్చితే అన్యాయంగా దింపేశారని ప్రజల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కొందరు ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు అంటున్నారు. మరికొందరు మాత్రం ఏడాది కాలమైనాసరే వైసీపీ నుంచి మేయర్ పీఠాన్ని గుంజుకోవాల్సిందేనని పట్టుదలగా ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల చైర్మన్‌లు, మేయర్‌ల మార్పుపై సీఎం చంద్రబాబునాయుడు ఎలాంటి ప్రకటన చేస్తారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆర్టీఛీ కాంప్లెక్స్

... 7వ పేజీ తరువాయి

లేకుంటే ప్రమాదానికి గురయ్యే అవకాశముంది.

తాగునీటికి అవస్థలు

ప్రయాణికుల కోసం స్వచ్ఛంద సంస్థ ఒకటి ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను రెండేళ్ల కిందట ఏర్పాటు చేసింది. దీనిని నిత్యం శుభ్రం చేయకపోవడంతో ట్యాంకులో నీరు అపరిశుభ్రంగా మారింది. అలాగే అక్కడే ఏర్పాటుచేసిన కొళాయిల హెడ్‌ల వద్ద నాచు పట్టేసింది. నీరు తాగేందుకు వెళ్లే వారికి అక్కడ అపరిశుభ్రతను చూస్తే ఒళ్లు జలదరిస్తుంది.

నాణ్యత లేని ఆహార ఉత్పత్తులు విక్రయం

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను మాత్రమే విక్రయించాల్సి ఉండగా, అధిక లాభార్జన కోసం వ్యాపారులు ఊరూపేరు కంపెనీలవి అమ్ముతున్నారు. బ్రాండెడ్ వస్తువును పోలి ఉండేలా ప్యాకింగ్ కలిగిన వస్తువులు, వాటర్ బాటిళ్లను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మరోమార్గం లేక ప్రయాణికులు వాటినే కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. ప్రయాణికుల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిసినప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తుండడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రయాణికుల సౌకర్యానికే ప్రాధాన్యం

ద్వారకా బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. పరిశుభ్రత, పరిసరాలను శుభ్రంగా ఉంచడం కోసం ప్రతి రోజూ తనిఖీలు చేస్తున్నాం. దీనివల్ల గతంతో పోల్చితే పరిస్థితులు బాగున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. మరుగుదొడ్ల నిర్వహణ ఇంకా మెరుగుపడాల్సి ఉందని నిర్వాహకులకు చెప్పాం. సీసీ కెమెరాల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం. కాంప్లెక్స్ ఆవరణలోని వ్యాపారులు ఎంఆర్‌పీకే విక్రయించాలని, నాణ్యత లేని పదార్థాలను అమ్మకూడదని ఇటీవలే సమావేశం పెట్టి హెచ్చరించాం. కుక్కల సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళతాం.

-బి.అప్పలనాయుడు, రీజినల్ మేనేజర్

కాశీలో రోడ్డు ప్రమాదం

... 7వ పేజీ తరువాయి

ఆగివున్న లారీని బలంగా ఢీకొంది. దీంతో కారు నుజ్జు నుజ్జయి అందులో ఉన్నవారంతా తీవ్రంగా గాయపడ్డారు. జీవన్ (7) అనే బాలుడికి తీవ్రగాయాలు కావడంతో నాలుగు రోజులు ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకపోయింది. శనివారం ఉదయం మృతిచెందాడు. క్షతగాత్రులందరికీ రెండేసి శస్త్రచికిత్సలు జరిగాయి. ఇంకా వారెవరూ కోలుకోలేదు. ప్రమాద విషయం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి తెలియడంతో కలెక్టర్‌కు సమాచారం అందింది. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం మేరకు ములగాడ మండల తహసీల్దార్ భుజంగరావు శనివారం బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు తెలియజేశారు.

దేశ ప్రజలకు రక్షణ కవచం రాజ్యాంగం



ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగ ప్రతిని చూపిస్తున్న ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర్లు, లైబ్రరీ సిబ్బంది

» ఏయూ లైబ్రరీలో రాజ్యాంగ ప్రతి

» నేడు గణతంత్ర దినోత్సవం

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):

మన దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందంటే దానికి రాజ్యాంగమే కారణం. ప్రతి వ్యవస్థ రాజ్యాంగం ప్రకారమే పనిచేస్తోంది. ప్రజల హక్కులకు రక్షణ, బాధ్యతలను రాజ్యాంగమే గుర్తు చేస్తోంది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయింది. ఈ నేపథ్యంలో 76వ గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చింది. ఆ రోజుకు గుర్తుగా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. రాజ్యాంగ ముసాయిదా కొన్ని ప్రతులను చేతిరాతతో రాయించారు. వీటిపై రాజ్యాంగ పరిషత్ సభ్యులు 208 మంది సంతకాలు చేశారు. తొలి 15 మందిలో ఏడుగురు తెలుగువారు ఉండగా, ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థిని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకరు కావడం గమనార్హం. ఏటా గణతంత్ర దినోత్సవాన్ని ప్రత్యేకంగా ఒక థీమ్‌తో జరుపుతారు. ఈ ఏడాది స్వర్ణ భారత దేశం : వారసత్వం - పురోగతి థీమ్‌తో నిర్వహిస్తున్నారు. చేతితో రాసిన రాజ్యాంగ ముసాయిదా ప్రతిని 1957లో ఏయూ లైబ్రరీలో పొందుపరిచారు.

మార్గదర్శకం : దేశంలోని చట్టాలు అందరికీ సమానంగా పని చేసేలా రాజ్యాం గమే మార్గదర్శనం చేస్తోంది. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రజ లు రక్షణ పొందడానికి రాజ్యాం గమే కవచంలా ఉపకరిస్తోందని నిపుణులు చెబుతున్నారు. దేశంలో ఆర్థిక, అంగ బలాలకు, రాజకీయ ప్రాబల్యాన్ని తట్టుకుంటూ సాధారణ ప్రజలు రక్షణ పొందగలగడం రాజ్యాంగం కల్పించిన హక్కులే. మారుతున్న కాలానికి అనుగుణంగా రాజ్యాంగ మౌలిక స్వరూపం మారకుండా ఆర్టికల్స్‌లో సవరణలు చేసుకునే అవకాశాన్ని రచన కమిటీ కల్పించింది.

ఏయూలో రాజ్యాంగ ప్రతి

రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఏడేళ్ల తరువాత రాజ్యాంగ ప్రతి ఏయూకు వచ్చింది. అప్పటి నుంచి దీన్ని అత్యంత జాగ్రత్తగా భద్రపరుస్తున్నాం. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రదర్శనకు ఉంచి విద్యార్థులకు తెలియజేస్తున్నాం. దేశంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే ఈ ప్రతిని పంపించారు. దేశంలోని పురాతన విశ్వవిద్యాలయాల్లో ఒకటి ఏయూ కావడంతో ఇక్కడకు ప్రతిని పంపారు. ఉస్మానియా యూనివర్సిటీతో పాటు ఏయూకు మాత్రమే ఈ ప్రతులు వచ్చాయి. వర్సిటీలోని పలువురు విద్యార్థుల పరిశోధనకు ఇది ఎంతగానో ఉపయోగ పడింది.

- పి వెంకటేశ్వర్లు, చీఫ్ లైబ్రేరియన్, ఏయూ

రాజముద్ర


రాజ్యాంగం గొప్పతనం విద్యార్థులకు తెలియాలి..



దేశంలోని ప్రతి పౌరుడు స్వేచ్ఛగా బతుకుతున్నాడంటే దానికి రాజ్యాంగం కల్పించిన హక్కులే కారణం. అందుకు తగ్గట్టు బాధ్యతలను నిర్వర్తించాలి. ఏళ్లు గడుస్తున్నా దేశంలో ప్రజాస్వామ్యం విరాజిల్లుతోందంటే దానికి మూల కారణం రాజ్యాంగమనే విషయాన్ని గుర్తించాలి. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన నిర్ణయాలు తీసుకునేందుకు కొందరు యత్నిస్తున్నా.. ప్రజాస్వామ్య దేశంలో అవి సాధ్యం కాదు. ఈ తరహా చర్యలను ప్రజలతోపాటు రాజకీయ పార్టీలు వ్యతిరేకిస్తాయి. అదే రాజ్యాంగం గొప్పతనం. రాజ్యాంగ రచనకు అప్పట్లో మేధావులు శ్రమించిన తీరు, దీనితో ప్రజలకు కలుగుతున్న మేలు గురించి నేటి తరం విద్యార్థులకు తెలియజేయాలి. గణతంత్ర దినోత్సవం గురించి చాలా మంది విద్యార్థులకు అవగాహన ఉండడం లేదు. ఇది బాధాకరం.

- ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం, ఏయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి

చిన్నారుల సమస్యను రాజకీయం చేయడం తగదు


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనిత

వైసీపీకి రాష్ట్ర హోంమంత్రి అనిత హితవు

బాలికా సదనం హోంలో సమస్యను పరిష్కరించామంటూ వెల్లడి

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బాలికల సదనం హోంలో సమస్యను సకాలంలో స్పందించి పరిష్కారం చూపామని, దీన్ని వైసీపీ శ్రేణులు రాజకీయం చేయడం తగదని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. శనివారం ఆమె చినగదిలిలోని బాలిక సదనం, పరిశీలన గృహాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమస్య తనకు తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్, సీపీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మాట్లాడానని చెప్పారు. సున్నితమైన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించినట్టు చెప్పారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి పిల్లలను వారి ఇళ్లకు పంపినట్టు చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన బాలిక సమస్య న్యాయస్థానంలో ఉందని, కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.తాను సదన్‌లో ఒక్కో బాలికతో వ్యక్తిగతంగా మాట్లాడానని, వారి సమస్యలను తెలుసుకున్నానన్నారు. చిన్నారులు కావడంతో కొన్ని పరిణామాలు ఎదురు కావడంతో మానసిక ఒత్తిడికి గురై ఆవేదనకు లోనయ్యారని హోంమంత్రి అన్నారు. ఇక్కడి చిన్నారులకు కౌన్సెలింగ్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ప్రతి విషయాన్ని భూతద్దంతో చూడడం, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాన్ని వైసీపీ నేతలు మానుకోవాలని హోంమంత్రి హితవు పలికారు. ఈ సమస్యను చాకచక్యంగా పరిష్కరించిన ద్వారకా ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, శిశు, సంక్షేమ శాఖ అధికారులను హోంమంత్రి అభినందించారు. ఆమె వెంట బాలికల హోం సదనం సూపరింటెండెంట్ సునీత తదితరులు ఉన్నారు.

చిన్నారులతో ముచ్చటించిన హోంమంత్రి

అంతకుముందు బాలికల సదనంను సందర్శించిన హోంమంత్రి అనిత అక్కడ ఉన్న బాలికలు ఒక్కొక్కరికితో మాట్లాడారు. ఎలాంటి సమస్యలు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రత్యేక శ్రద్ధతో చదువుకోవాలని సూచించారు. గృహ సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు, వైద్యులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మానసిక వైద్యులతో చిన్నారులకు కౌన్సెలింగ్ అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ, మానసిక వైద్యశాల ప్రొఫెసర్ ప్రసన్నకుమార్, శిశు-మహిళా సంక్షేమ శాఖ పీడీ జి.జయదేవి, పర్యవేక్షణాధికారి సునీత పాల్గొన్నారు.

చెత్తను సద్వినియోగం చేస్తే సంపద: డీపీవో


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు

పెందుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఘన,ద్రవ వ్యర్థాల సమర్థ నిర్వహణ ద్వారానే పారిశుధ్యం మెరుగుపడుతుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సెంటర్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్ అండ్ యాక్టివిటీస్ (సైడా) ఆధ్వర్యంలో శనివారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో 'ఘన వ్యర్థాల నుంచి సంపద సృష్టి' అనే అంశంపై పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి, యువతకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ చెత్తను సద్వినియోగం చేస్తే సంపద వస్తుందన్నారు. పంచాయతీల్లో ఘన వ్యర్థాల నిర్వహణకు (శాలిడ్ వేస్ట్ ప్రొసెసింగ్ సెంటర్) షెడ్లు నిర్మించాలని సూచించారు. యువత గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం సైడా ఆర్గనైజింగ్ సంస్థ సంపద కేంద్రాలను పంచాయతీ ఆదాయ వనరుగా మార్చే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఈవోఆర్డీ జె.అప్పలరాజు, సైడా మేనేజరు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

గోపాలపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంసం విక్రయాలను నిషేధిస్తూ వర్తకులకు జీవీఎంసీ అధికారులు నోటీసులిచ్చారు. కబేళా సెలవు దినాల్లో మాంసం విక్రయాలు చేపట్టడం నిషేధం. ఈ ఏడాది రిపబ్లిక్ డే ఆదివారం రావడంతో మాంసం వర్తకులు వ్యాపారం చేసే అవకాశం ఉండడంతో రెండు రోజుల ముందు నుంచే ఆయా ప్రాంతాల్లోని సంబంధిత జోనల్ కార్యాలయ సిబ్బంది మాంసం వర్తకులకు నోటీసులు అందజేశారు. ఆదివారం మాంసం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రత్యేక బృందం తనిఖీలు చేపట్టనున్నది.

నేడు మెగా రక్తదాన శిబిరం

మల్కాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఆదివారం ఉదయం శ్రీహరిపురం జీవీఎంసీ వాకర్స్ మైదానం వద్ద పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ చైర్మన్, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ తెలిపారు. రాజకీయ పార్టీలకు అతీతతంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం ఆరు గంటల నుంచే శిబిరం ప్రారంభమవుతుందన్నారు. రక్తదాతలకు పౌష్టికాహారం, ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీ నరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచర పాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 52, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 16, క్యారెట్ 28, దొండకాయలు 44, బంగాళదుంపలు 25, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది)46, బరబాటి 42, మునక్కాడలు (కిలో) 110, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, పొటల్స్ 80, కీరదోస 34, పొట్లకాయ (పెద్దది) 28, క్యాప్సికమ్ 40, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 38, గోరుచిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

» **టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**


76వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గాజువాకను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 76వ వార్డు పరిధి నడుపూరులో రూ.26 లక్షల వ్యయంతో నిర్మించిన సామాజిక భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అలాగే డెయిరీ కాలనీ-1లో పార్కును రూ.50 లక్షలతో, డెయిరీ కాలనీ-2లో రూ.96.9 లక్షల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేసేందుకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా నడుపూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తనకు అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించిన గాజువాక ప్రజల రుణాన్ని తీర్చుకునేందుకు గాను నియోజవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ వార్డు పరిధిలో నూతన కాలనీలు ఎక్కువగా ఉన్నాయని, వీటికి మెరుగైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమకూర్చేందుకు అధిక నిధులు కేటాయించాలని పల్లాను కోరారు. కార్యక్రమంలో జడ్సీ శేషాద్రి, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొసెట్టి అప్పారావు, కార్యదర్శి సుదర్శనరావు, నాయకులు పీత రమణ, వి.వెంకన్న, పంచదార్ల ఉగ్రం, తదితరులు పాల్గొన్నారు.

70వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 70వ వార్డు పరిధిలోని ఎర్రగెడ్డ కాలనీ, చట్టివానిపాలెంలలో రూ.మూడో కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉరుకూటి చందు, కూటమి నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావు, బి.రమణ, పీఎంఎల్ నాయుడు, లంకల మురళీదేవి, సూరిబాబు, శ్రీకాంత్, పాల్గొన్నారు.

ఓటు విలువను అందరూ గుర్తించాలి

జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు విలువను ప్రతి ఓటరూ గుర్తించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. శనివారం ఉదయం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి జేసీ, ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ కిశోర్‌బాబులు ప్రారంభించారు. అనంతనం జేసీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు ఓటరుగా నమోదవ్వడంతో పాటు చుట్టుపక్కలవారు కూడా నమోదయ్యేలా ప్రోత్సహించాలన్నారు. ఏయూ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిశోర్‌బాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద కానీ ఎన్నికల సంఘం మొబైల్ యాప్‌లో గానీ ఓటరుగా నమోదు కావాలన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఆర్‌వో భవానీశంకర్, ఆర్డీవో కె.సంగీత్ మథుర్, ఎస్డీసీలు ఎస్.మధుసూదనబాబు, జె.సీతారామారావు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

పెందుర్తి: ఓటు ప్రజాస్వామ్య హక్కు అని నియోజకవర్గ ఎన్నికల అధికారి పి.శేషశైలజ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఓటరు నమోదు సామాజిక బాధ్యత అన్నారు. అనంతరం ఓటరుగా నమోదు కావాల్సిన బాధ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులు, అధికారులు పెందుర్తి జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ఈఆర్వో బహుమతులు అందజేశారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది బెనర్జీ, తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, ఎన్నికల డీటీ వి.అర్జునరావు, డీటీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ, జీవీఎంసీ ఉద్యోగులతో ప్రతిజ్ఞ

ఎన్.ఎ.డి.జంక్షన్: గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్డీవో పి.శ్రీలేఖ పాల్గొని రెవెన్యూ, జీవీఎంసీ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదన్నారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు బుచ్చిరాజుపాలెం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎన్.ఎ.డి.ఫ్లైఓవర్ పరిసరాల్లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సీహెచ్ రమేశ్, జెడ్సీలు కె.హేమవతి, బి.రాము, డీటీలు సువర్ణబాయి, రమ, త్రినాథ్ పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన

ఆటోనగర్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ వెల్ఫేర్ అసోషియేషన్ (వాసీవా) కార్యాలయంలో శనివారం ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో రజక, బోట్ తయారీదారులకు ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆదిశేషు మాట్లాడుతూ సంప్రదాయకంగా తమ చేతులతో, పనిముట్లు, సామగ్రితో కష్టించి ఏదో ఒకదానిని సృష్టించిన విశ్వకర్మలు ఈ దేశ నిర్మాతలు అని అన్నారు. ఈ పథకానికి సంబంధించి పలు సందేహాలను నివృత్తి చేశారు. వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ సంప్రదాయ వృత్తిలో ఉంటూనే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలన్నారు. ఎంఎస్‌ఎంఈ ఏడీ చంద్రమౌళి మాట్లాడుతూ ఈ పథకానికి అర్హులెవరు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో వివరించారు. జీవీఎంసీ యూసీడీ ఏపీడీ దుర్గాప్రసాద్, జిల్లా మేనేజర్ అల్లు జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతి చెందిన సత్యనారాయణ (ఫైల్ ఫొటో)

వేపగుంట జనవరి 25(ఆంధ్రజ్యోతి): అప్పన్నపాలెం దరి బాలాజీహిల్ వ్యూ రెసిడెన్సీలో ఉంటున్న జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి జి.వెంకటసత్యనారాయణ (47) ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ పైనుంచి జారిపడి మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వేపగుంట జోన్-8 కార్యాలయ పరిధి 92వ వార్డులో ట్యాక్స్ కలెక్టర్‌గా వెంకట సత్యనారాయణ విధులు నిర్వహించేవారు. శనివారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో అపార్ట్‌మెంట్ గోడపై తువ్వాలు ఆరబెట్టడానికి వెళ్లి, అది ఎగరడంతో దాన్ని పట్టుకునే ప్రయత్నం చేశారు. దీంతో ప్రమాదవశాత్తు పిట్టగోడ పైనుంచి జారి కిందపడ్డారు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో భార్య లత, కుమారుడు ఇంట్లో ఉన్నారు. ఒక్కసారిగా శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా తలకు తీవ్ర గాయాలతో సత్యనారాయణ కనిపించడంతో వారు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. రక్తస్రావం అధికం కావడంతో అప్పటికే మృతి చెందారు. పెందుర్తి ఎస్ఐ అసిరతాత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణ కుమార్తెకు వివాహమై అమెరికాలో ఉంటుండగా, కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు.

రైలులో 5 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి పోలీసులు రైలులో చేపట్టిన తనిఖీల్లో ఐదు కిలోల గంజాయి దొరికింది. సీఐ కేవీ సతీశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఒడిశా నుంచి వస్తున్న రైలులో పోలీసులు తనిఖీ చేయగా, కడపకు చెందిన ఓ వ్యక్తి సంచిలో దాచిన ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు చుక్కలు చూపించిన కిలేడీ దంపతులు

ఎంవీపీ కాలనీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తన భర్త మన్నెందొర చంద్రశేఖర్ పెద్ద వ్యాపారవేత్త అని, తాను మానవ హక్కుల కమిషన్‌లో జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నానంటూ పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడిన భాగ్యరేఖ దంపతులు అరెస్టు చేసే సమయంలో ఎంవీపీ పోలీసులకు చుక్కలు చూపించారు. వీరిని ఒంగోలులో అదుపులోకి తీసుకుని, రెండు వాహనాల్లో తీసుకొస్తుండగా మార్గంమధ్యలో అతి చేశారు. అనారోగ్యం అని చెప్పడంతో తుని సమీపంలో ఓ ఆస్పత్రికి పోలీసులు తీసుకెళ్లి వైద్యం అందించారు. నిందితులు తమ సొంత వాహనంలో పోలీసులను అనుసరిస్తూ కొన్ని చోట్ల వేగంగా వెళ్లడం, మరికొన్ని చోట్ల బాగా నెమ్మదిగా వస్తూ ఇబ్బందులకు గురి చేశారు. ఆనందపురం వద్ద ముందున్న ఓ లారీని ఢీకొట్టి హడావుడి చేశారు. దీంతో పోలీసులు అంబులెన్స్‌లో వారిని నగరానికి తీసుకొచ్చి ప్రాథమిక చికిత్స చేయించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా, జనవరి 25, (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్ర కాలనీ, చింతలలోవ కొండ ప్రాంతాల్లో రక్షణ గోడలు, గ్రామ కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులకు శనివారం కార్పొరేటర్ గల్లా పోలిపల్లి (చిన్నా) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో కొండవాలు ప్రాంతాల ప్రజలు వర్షాల సమయంలో పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సుమారు రూ 2 కోట్ల జీవీఎంసీ నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పనులకు శంకుస్థాపన చేయడం ఆనందదాయకమన్నారు. స్థానిక నాయకులు జె.నరసింగరావు, గుడేల కృష్ణ, బాబూరావు, పి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటిస్తే మంచి విజయాలు: కర్మాగారాల చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి

మల్కాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలను అభివృద్ధి చేయడంతో పాటు భద్రతా చర్యలు చేపడితే మంచి విజయాలు సాధించవచ్చని కర్మాగారాల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలపై ఏపీ కర్మాగారాల శాఖ కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భవనంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడు తగిన జాగ్రత్తలు తీసుకుని పనిచేస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవన్నారు. కార్యక్రమంలో ఎరువుల కర్మాగారం సంస్థ ఉన్నతాధికారులు ఎం.జ్ఞానసుందరం, శ్రీనివాసరాజు, నాగరాజు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

29న సింహాద్రి అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి అప్పన్న స్వామి తెప్పోత్సవం ఈనెల 29న నిర్వహించనున్నట్టు ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఆలయంలో జరిగే వార్షికోత్సవాల్లో భాగంగా ఏటా పుష్యమాస బహుళ అమా వాస్య నాడు కొండదిగువ పుష్కరిణిలో తెప్పోత్సవం జరపడం ఆనవాయితీ. ఈ మేరకు ఆ రోజు మధ్యాహ్నం 3.30 గంటలకు స్వామివారిని పల్లకిపై మెట్ల మార్గంలో తీసుకువచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన హంసాకృతి నౌకలో అధిష్టింపజేసి ఉత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని సర్వజన మనోరంజని వాహనంపై మాడ వీధుల్లో ఊరేగిస్తారు. ఈ నేపథ్యంలో ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామివారి దర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు.

సినీ నటుడు శ్రీకాంత్‌కు స్వాగతం

గాజువాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విశాఖ విచ్చేసిన సినీ నటుడు శ్రీకాంత్‌కు శనివారం విమానాశ్రయంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు స్వాగతం పలికారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా విశాఖ విచ్చేసిన శ్రీకాంత్ ఏబీవీపీ రాష్ట్ర స్థాయి సదస్సులో పాల్గొంటారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, రాజశేఖర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. వేతనాలు చెల్లించాలని, ఉక్కు కర్మాగారంలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కుంటుపడ్డాయన్నారు. వేతనాలు లేక ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్లను మెరుగుపరచాలని పేర్కొన్నారు. అనంతరం సీజీఎం (వర్క్స్)కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రాజు, నాయకులు నీరుకొండ రామచంద్రరావు, కారు రమణ, కొవిరి అవతారం, ఎస్ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ క్యాషియర్ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎన్.ఎ.డి.జంక్షన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీ జంక్షన్ సంత వెనక ఉన్న అన్న క్యాంటీన్‌లో పర్యవేక్షణ లోపంతో ఏర్పడుతున్న ఇబ్బందులపై అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. ఇక్కడి క్యాంటీన్‌లో క్యాషియర్ వ్యవహార శైలిపై శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'అన్న క్యాంటీన్‌పై పర్యవేక్షణ లోపం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. ఈ క్యాంటీన్‌ను జోన్-8 జడ్సీ కె.హేమవతి, ఏపీడీ చిరంజీవి ఉదయం పరిశీలించి విచారణ జరిపారు. సంబంధిత కాంట్రాక్టర్ నుంచి వివరణ కోరి తక్షణమే క్యాషియర్‌ను విధుల నుంచి తప్పించాలని ఆదేశించారు. అన్న క్యాంటీన్ల పనితీరుపై నిరంతరం పరిశీలన చేయాలని యూసీడీ విభాగ అధికారులను జడ్సీ ఆదేశించారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఈవీఎల్ఎన్ వంశీకృష్ణ అన్నారు. స్కూల్‌లో శనివారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. క్రీడల్లో రాణించే వారికి విద్య, ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. తమ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. అనంతరం పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సందీప్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరస

అక్కిరెడ్డిపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక ప్రాంతంలో అతిపెద్ద పరసగా పేరొందిన అక్కిరెడ్డిపాలెం కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల జాతర ఆదివారం జరగనున్నది. ఇక్కడి హైస్కూల్ మైదానంలో ఉన్న గ్రామ దేవతలైన కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయాల వద్ద అమ్మవార్ల పరసను ఏటా గణతంత్ర దినోత్సవం నాడు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పరస సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

కొత్తపాలెంలో పరదేశమ్మ తీర్థం

గోపాలపట్నం: కొత్తపాలెంలోని పరదేశమ్మ ఆలయ తీర్థ ఆదివారం జరగనున్నది. వేకువజాము అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజాది కార్యక్రమాలు నిర్వహించాక భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. అధిక సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం గ్రామంలో పరస నిర్వహిస్తారు.

లేమర్తి రామాలయం వద్ద..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి రామాలయం వద్ద ఆదివారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరుపుతామన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పరసను పురస్కరించుకుని కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మలకొలువు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు.